

మంత్రుల పర్యటనలు వాయిదా

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపంగా శుక్రవారం మంత్రులు తుమ్మల, పొంగులేటి పర్యటనలు వాయిదా పడ్డాయి. శుక్రవారం జిల్లాలో ఇద్దరు మంత్రుల పర్యటన ఖరారు కాగా మన్మోహన్‌సింగ్ మృతితో ఆయనకు సంతాపంగా అధికారిక కార్యక్రమాలను వాయిదా వేసుకున్నారు. మంత్రి తుమ్మల హైదరాబాద్‌లో ఉండిపోయారు. మంత్రి పొంగులేటి తన కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ప్రైవేటు కార్యక్రమాలకు హాజరయ్యారు.



పరేషాన్ చేసిన గూగుల్ మ్యాప్

భద్రాచలం రాజవీధిలో ఇరుక్కుపోయిన టూరిస్టు బస్సు

భద్రాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూగుల్‌మ్యాప్‌ను అనుసరిస్తూ భద్రాచలానికి వచ్చిన ఓ టూరిస్టు బస్సు.. రాజవీధి జంక్షన్‌లో ఇరుక్కుపోయింది. దీంతో అందులో ఉన్న భక్తులు బస్సును బయటకు తీసేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. విజయనగరం నుంచి భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించేందుకు ఓ టూరిస్టు బస్సు గూగుల్‌మ్యాప్‌ను అనుసరిస్తూ వచ్చింది. భద్రాచలంలో రాజవీధిలో మలుపు తిరిగిన సమయంలో ఓ వైపున ఇరుక్కుపోయింది. దీంతో గంటల తరబడి అందులోని భక్తులు ఇబ్బందులు పడుతూ బయటకు వచ్చారు. అనంతరం స్థానికుల సహకారంతో బస్సును తీశారు. దీంతో 'గూగుల్‌మ్యాప్‌కో దండం..' అంటూ భక్తులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. బస్సు కరకట్ట మీద నుంచి, హరిత హోటల్ మార్గాల్లో పార్కింగ్ ప్రదేశానికి వెళ్లకుండా గూగుల్‌మ్యాప్‌ను అనుసరిస్తూ రాజవీధి వైపు రావడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది.



క్యాంప్ ఫైర్‌ను పరిశీలిస్తున్న గిరిజన గ్రామాల ప్రతినిధులు

పర్యాటక అభివృద్ధికి సంకల్పం

- ములుగు బ్లాక్ బెర్రీ ఐలాండ్ సందర్శనకు వెళ్లిన గిరిజనులు

కొత్తగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ప్రత్యేకమైన పర్యాటక ప్రాంతాలతో పాటు గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను బాహ్య ప్రపంచానికి తెలియచేసి పర్యాటకపరంగా అభివృద్ధి పర్చాలని కలెక్టర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ చొరవతో శుక్రవారం బొజ్జిగుప్ప, బెడాలపాడు, భద్రాచలం, పూబెల్లి గ్రామసభ్యులు, సిబ్బందితో కూడిన 25మంది బృందాన్ని ములుగు జిల్లా పరిసర అటవీ ప్రాంతంలో ఉన్న బ్లాక్ బెర్రి ఐలాండ్ సందర్శనకు పంపారు. పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు, అవలంభించాల్సిన పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు వీలు కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న గుడారాలు, సహజసిద్ధంగా కర్రలతో ఏర్పాటుచేసిన పందిళ్లు, మంచెలు, క్రీడామైదానాలను సభ్యులు పరిశీలించారు. తమ గ్రామాల్లో కూడా ఇటువంటివి ఏర్పాటు చేసుకుని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పర్చడానికి ఈ పర్యటన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



నెరవేరుతున్న కలలు

ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు 2024వ సంవత్సరం వేదికగా నిలిచింది. అభివృద్ధి పనులకు బాటలు వేస్తూ పెండింగ్ సమస్యలకు భరోసా కలిగించింది. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్యమంత్రిగా ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, చేనేత, మార్కెటింగ్ శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీనికి తోడు జిల్లానుంచి కాంగ్రెస్ తరపున కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి, బీఆర్‌ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి జిల్లానుంచి రాజ్యసభకు నాయకత్వం వహిస్తున్నారు. ఎంపీలుగా రఘురాంరెడ్డి, బలరాంనాయక్‌లు ఉండగా జిల్లా నుంచి నలుగురు కార్పొరేషన్ చైర్మన్లు పదవుల్లో ఉన్నారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు కూడా జిల్లాకు చెందిన ఏలూరి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో అభివృద్ధి పనులు వడివడిగా ముందుకు సాగుతున్నాయి.

2024 కాలచక్రం

ప్రగతి దారుల్లో...

ఏడాదిలో పలు అభివృద్ధి పనులకు మోక్షం

- సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాల విడుదల
- భద్రాచలం వద్ద గోదావరి నదిపై రెండో వారధి ప్రారంభం
- పర్యాటక అభివృద్ధికి నిధుల విడుదల
- ప్రభుత్వ వైద్యకళాశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలకు శాశ్వత భవనాలకు నిధులు
- పరుగులు పెడుతున్న జాతీయ రహదారుల పనులు

ఖమ్మం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బీఆర్‌ఎస్ పాలనలో పనులు జరగక నత్తనడకన ఉన్న సీతారామ సాగునీటి ప్రాజెక్టుకు.. 2024లో మోక్షం లభించింది. రూ.15,500 కోట్లతో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన సీతారామ పథకం మూడులిఫ్టులు పూర్తిచేసుకుని కాలువలు తవ్వి నిరుపయోగంగా ఉంచారు. దీంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని జూలూరుపాడు మండలం వినోబానగర్ నుంచి ఏన్కూరులోని సాగర్‌కెనాల్‌కు లింక్‌కెనాల్ రూ.90కోట్లు మంజూరు చేశారు. సీతారామపై సమీక్ష నిర్వహించారు. దీనికి రాజీవ్‌కెనాల్‌గా నామకరణం చేసి ఆగస్టు 15నాటికి పూర్తిచేయించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా మూడు ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు. దీంతో సీతారామ తొలిదశ కింద గోదావరి జలాలు కృష్ణా బేషిన్‌లోని సాగర్ ఆయకట్టుకు అనుసంధానమయ్యాయి. 2026 ఆగస్టు 15నాటికి మొత్తం సీతారామ పనులు పూర్తిచేసే లక్ష్యంతో సుమారు రూ.19వేల కోట్లకు అంచనాలు పెంచి పనులకు టెండర్లు పిలిచారు. గోదావరి జలాలు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున కృష్ణాజలాలతో అనుసంధానం కావడం, ఆంధ్రాలోని పట్టిసీమ కాలువ వలే ఏన్కూరు లింక్‌కెనాల్ కాల్వ ద్వారా సాగర్ ఆయకట్టుకు కొంత మోక్షం లభించింది. అలాగే రూ.690కోట్లతో ఖమ్మం మున్నేరుకు రెండువైపులా గోడల నిర్మాణ పనులు ఈ ఏడాదే ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి టెండర్లను నీటిపారుదల శాఖ మున్నేరు గోడలకే అనుమతి ఇచ్చింది. అలాగే మున్నేరుపై రూ.180కోట్లతో నిర్మించబోతున్న తీగల బ్రిడ్జికి పనులు కూడా ఈ ఏడాదే మొదలయ్యాయి. ఈ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

గోదావరిపై బ్రిడ్జి పూర్తి..

భద్రాచలం వద్ద గోదావరి నదిపై ఉన్న రెండో వారధి గత దశాబ్దాకాలంగా అసంపూర్తిగా ఉండడంతో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకుని పనులు పూర్తి చేయించారు. నవమిరోజున అప్పటి కలెక్టర్ చేతులమీదుగా రెండోవారధి ప్రారంభింపచేశారు. దీంతో భద్రాచలానికి ట్రాఫిక్ (మిగతా 6వ పేజీలో)

పర్యాటకపరంగా...

ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతోపాటు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పాలేరు నుంచి భద్రాచలం వరకు పర్యటించారు. ఫలితంగా మంత్రుల చొరవతో ఖమ్మంఖిల్లాకు రూ.30కోట్లు, పాలేరు జలాశయానికి రూ.5కోట్లు, నేలకొండపల్లి బౌద్ధస్థూపానికి రూ.5కోట్లు, జమలాపురం ఆలయానికి రూ.5కోట్లతో పాటు పులిగుండాల ఏకోటూరిజం అభివృద్ధికి, కిన్నెరసాని, భద్రాచలం పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సుమారు రూ.80కోట్ల నిధులు కేటాయించారు. పనులు ప్రారంభించాల్సి ఉంది.

దేశం విశిష్ట నేతను

కోల్పోయింది

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించి ప్రసంగిస్తున్న పొంగులేటి

ఖమ్మం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటని, దేశం ఒక విశిష్ట నేతను కోల్పోయిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మన్మోహన్‌సింగ్ భారతదేశానికి ఎన్నో సేవలందించారని, దేశ ప్రధానిగా, ఆర్థికవేత్తగా, రాజ్యసభ సభ్యుడిగా భారత ఆర్థిక వ్యవస్థను సంస్కరించడంలో ఆయన నిర్వర్తించిన పాత్ర కీలకమైందన్నారు.

దేశ రిజర్వుబ్యాంకు గవర్నర్‌గా, ఆర్థికశాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారని, భారతదేశ ఆర్థిక ముఖచిత్రానికి దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. ఆయన రాజకీయ జీవితం, వినయంతో కూడిన జీవితం అందరికీ ఆదర్శమని, తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష కూడా మన్మోహన్ హయాంలోనే నెరవేరిందన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేసిన ఘనత మన్మోహన్‌సింగ్‌దని, అణు ఒప్పందం, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, భారతీయ పౌరుడికి ఆధార్ గుర్తింపు కార్డులు అన్నీ మన్మోహన్‌సింగ్ ప్రవేశపెట్టినవేనని గుర్తుచేశారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ దేశానికి ఆర్థిక సంస్కరణలతోపాటు ఎన్నో కీలక చట్టాలను అమలుచేసిన ఘనత మన్మోహన్‌సింగ్‌దని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో 30నుంచి ఆన్‌లైన్ తరగతులు



ఖమ్మంరూరల్ కేజీబీవీలో బందోబస్తులో కానిస్టేబుల్

- మహిళా కానిస్టేబుల్‌తో రాత్రి పూట భద్రత
- డీఈవో సోమశేఖర శర్మ

6

నమ్మించి నట్టేట ముంచాడు...

- రూ.6కోట్ల అప్పులు చేసి పరారైన సుతారి మేస్త్రీ
- అధిక వడ్డీల ఆశతో నిండా మునిగిన పలువురు వ్యక్తులు
- నేలకొండపల్లిలో వెలుగుచూసిన ఘరానా మోసం
- నిందితుడు రఫీ స్వస్థలం అనంతపురం జిల్లా



నేలకొండపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన డబ్బుకు మూడు నెలల్లో రెట్టింపు ఇస్తానని నమ్మబలికాడు... అధిక వడ్డీల ఆశ చూపాడు... తొలుత చిన్న మొత్తాలు తీసుకుని తిరిగి ఇచ్చేశాడు... అందరినీ నమ్మించాడు... చివరకు పెద్ద మొత్తంలో అప్పులు తీసుకుని ఉడాయించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా నుంచి సుతారి పని చేయటానికి వచ్చిన వ్యక్తి ఘరానా మోసం ఇది. అప్పులిచ్చి మోసపోయిన బాధితులు తమకు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించారు.

బాధితుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా మడకశిర మండలం రోళ్ల గ్రామమని చెప్పుకుంటూ షేక్ రఫీ అలియాస్ ఖాజా అనే వ్యక్తి నాలుగేళ్ల క్రితం ఒంటరిగా నేలకొండపల్లికి వచ్చాడు. స్థానికంగా సుతారి పని చేస్తూ అందరితో కలుపుగోలుగా ఉండటం ప్రారంభించాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ సుతారులకు అవసరమైన సామాన్లు, బిల్డింగ్ మెటీరియల్‌తో ఓ షాపును కూడా ప్రారంభించాడు. ఈ క్రమంలో అందరినీ నమ్మిస్తూ అప్పులు తీసుకోవడం ప్రారంభించాడు. అప్పులు తీసుకున్న వారికి అధిక వడ్డీల ఆశ చూపాడు. మొదట్లో తిరిగి ఇచ్చేశాడు. అనంతరం పెద్ద మొత్తంలో అప్పులు తీసుకుని, తీసుకున్న మొత్తానికి మూడు నెలల్లో డబుల్ ఎమౌంట్ ఇస్తానని నమ్మించాడు. పనిలో పనిగా ప్లాట్లు కొనుగోలు చేయటం ప్రారంభించాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ప్రారంభించాడు. అతని (మిగతా 6వ పేజీలో)




పకడ్బందీగా 'ఇందిరమ్మ' ఇళ్ల సర్వే

- దరఖాస్తుదారులను సరైన విధంగా గుర్తించాలి
- రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎం.డి. వీపీ గౌతమ్

ఖమ్మం సంక్షేమ విభాగం/ఖమ్మం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'ఇందిరమ్మ సర్వేకు మీరు ఇంటింటికి వెళ్తే ఆ నివాసంలో ఉన్న కుటుంబం అద్దెకు ఉంటున్నారా.. లేక సొంత భవనమా అని మీరు ఎలా గుర్తిస్తారు..? ఇందిరమ్మ సర్వేలో మీరు ఎదుర్కొంటున్న సమస్యలేంటి..?' అంటూ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మెనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఖమ్మం నగర పాలక సంస్థ సర్వే బృందాలను ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో సర్వే పరిశీలన కోసం శుక్రవారం ఖమ్మం నగరంలోని మున్నేరు వరద పరివాహక ప్రాంతాలైన మోతీనగర్, బొక్కలగడ్డ, జలగంనగర్ ప్రాంతాల్లో వీపీ గౌతమ్ పర్యటించారు. సర్వే తీరుపై బృందాలతో నేరుగా మాట్లాడి వివరాలను తెలుసుకొని (మిగతా 6వ పేజీలో)

క్రీడల కోలాహలం



షాట్ కొడుతున్న క్రీడాకారిణి

- సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం
- పూర్వ పది జిల్లాల నుంచి 280 మంది క్రీడాకారుల రాక
- మూడు రోజులపాటు జరగనున్న పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఘనంగా ప్రారంభయ్యాయి. పోటీలకు రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి 140మంది బాలురు, 140మంది బాలికలు మొత్తం 280 మంది క్రీడాకారులు హాజరైనారు. నగరంలో 3 రోజులపాటు జరగనున్న ఈ పోటీల్లో తొలిరోజు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీవైఎస్‌వై సునీల్‌రెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లె నుంచి ప్రతిభ గల క్రీడాకారులను వెలికి తీసి వారిని ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా తయారు చేయడమే లక్ష్యంగా ఈ పోటీలను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ, అథ్లెటిక్స్ కోచ్ గౌస్ పలువురు సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.



వాలీబాల్ పోటీ దృశ్యం

తొలిరోజు విజేతల వీరే...

బాలుర విభాగం: ఖమ్మం జట్టు మెదక్ జట్టుపై 25-17, 25-20, 25-19 (3-0) స్కోరు తేడాతో విజయం సాధించగా, మహబూబ్‌నగర్ జట్టు హైదరాబాద్ జట్టుపై 25-08, 25-13, 25-20 (3-0) స్కోరు తేడాతో, వరంగల్ జట్టు నల్గొండ జట్టుపై 25-10, 25-19, 25-22 (3-0) స్కోరు తేడాతో, రంగారెడ్డి జట్టు కరీంనగర్ జట్టుపై 25-13, 25-22, 25-10 (3-0) స్కోరు తేడాతో విజయం సాధించాయి.

బాలికల విభాగం: నల్గొండ జట్టు రంగారెడ్డి జట్టుపై 25-13, 25-18, 19-25, 25-08 (3-1) స్కోరు తేడాతో విజయం సాధించగా, వరంగల్ జట్టు మెదక్ జట్టుపై 24-26, 21-25, 25-18, 25-22, 17-15 (3-2) స్కోరు తేడాతో, నిజామాబాద్ జట్టు ఖమ్మం జట్టుపై 25-09, 25-06, 25-13 (3-0) స్కోరు తేడాతో, మహబూబ్‌నగర్ జట్టు కరీంనగర్ జట్టుపై 25-19, 25-05, 25-18 (3-0) స్కోరు తేడాతో విజయం సాధించాయి.



ఐద్వా వర్క్‌షాపులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

మహిళల రక్షణకు చట్టాలు
పకడ్బందీగా అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

ఖమ్మంటౌన్, డిసెంబరు 27: మహిళలకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం పకడ్బందీ చట్టాలు అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్షురాలు సీ.అరుణజ్యోతి కోరారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్యభవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి ఐద్వా వర్క్‌షాప్‌లో ఆమె ప్రజాస్వామ్యం, సమానత్వం, స్త్రీ విముక్తి, కర్తవ్యాలు అనే అంశాలపై పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదన్నారు. పాలకులు ఎవరు ఉన్నా మహిళలకు రక్షణ కల్పించటంలో విఫలమవుతున్నారని విమర్శించారు. డ్రగ్స్, మద్యం. హింసను ప్రేరేపించే సినిమాల వల్ల యువత చెడుమార్గం పట్టి మహిళలపై అత్యాచారాలు చేస్తున్నారన్నారు. తమపై జరిగే హింస, అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని ఎదిరించి మహిళలకు విద్యనేర్పిన మొదటి మహిళ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా వచ్చే జనవరి 3న విద్యార్థినులను చైతన్య పరిచేందుకు పాఠశాలలు, కళాశాలల్లో సెమినార్లు, సదస్సులు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. మహిళా సాధికారత మాటల్లోనే ఉంటోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రిజర్వేషన్ బిల్లును అమలులోకి తేవడంలేదని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఊసే పట్టించుకోవటం లేదన్నారు. పోరాటాలు చేస్తేనే మహిళలు తమ హక్కులను సాధించుకోవచ్చని, ప్రతి మహిళ పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ వర్క్‌షాపులో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి బండి పద్మ, ఆఫీస్ బేరర్లు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



కళాకారుడు రవి ప్రసాద్‌కు సన్మానం

బూర్గంపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీకి చెందిన కళాకారుడు రవిప్రసాద్‌ను ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఐదు ఉమ్మడి జిల్లాల (ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్) పరిధిలోని తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కళాకారుడు రవిప్రసాద్‌ను శాలువతో సత్కారించి అవార్డును అందజేశారు. సన్మాన గ్రహీత రవి మాట్లాడుతూ తనను గుర్తించి అవార్డు అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

హమ్మయ్యా... ఏడాదికి పూర్తయింది!

వైరా-మధిర, జగ్గయ్యపేట రోడ్డులోని అండర్ హై లెవల్ వంతెన



పూర్తయిన గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన

వైరా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఏడాదికి గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తయింది. గతేడాది నవంబరు, డిసెంబరులో మొదలైన అండర్‌పాస్ హైలెవల్ వంతెన సెంట్రింగ్ ఒంగిపోయి ఈ ఏడాది జనవరి 18న కూలింది. వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్అండ్‌బీ రోడ్డులో సోమవరం గ్రామ సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్ హైలెవల్ వంతెన నిర్మాణంలో కొంతకాలం వరకు తీవ్ర జాప్యం జరిగింది. నేషనల్ హైవే అథారిటీకి చెందిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో డొల్లతనం అండర్ హైలెవల్ వంతెన కూలిన సమయంలో బయటపడింది. రూ.వేలకోట్లతో ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నాలుగులైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం సంబంధిత కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ల ఇష్టానుసారం జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. నేషనల్ హైవే అథారిటీకి చెందిన నిర్మాణాలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఏమాత్రం లెక్కచేయడం లేదనే విమర్శలున్నాయి. ఖమ్మంరూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలంలోని సోమవరం వరకు ప్యాకేజీ-1 కింద 33.64 కిలోమీటర్ల హైవే నిర్మాణాన్ని రూ.772.11కోట్లతో చేపట్టారు. 33వ కిలోమీటర్ వద్ద రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాలకు అత్యంత కీలకంగా ఉన్న వైరా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని చిల్లకల్లు, జగ్గయ్యపేట వెళ్లే రహదారిలో సోమవరం వద్ద చేపట్టిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన స్లాబ్ నిర్మాణ దశలోనే ఈ ఏడాది జనవరి 18 రాత్రి కుప్పకూలింది. ప్రమాద తీరు తీవ్రంగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆ కూలిన వంతెనను ఎట్టకేలకు దాదాపు ఏడాది కాలానికి పునర్నిర్మించారు. వాహనాలను కొద్దిరోజుల నుంచి ఈ అండర్‌పాస్ హైలెవల్ వంతెన కింది నుంచి రాకపోకలకు అనుమతించారు. వంతెనకు రెండువైపులా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డును నిర్మిస్తున్నారు. మొత్తంగా అందరిని భయకంపితులను చేసిన అండర్‌పాస్ హైలెవల్ బ్రిడ్జి పూర్తయింది.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం
ఎదురు చూపులు

- సిగ్నల్స్ లేక ఆయా గ్రామాల్లో నిలిచిన సర్వే
- ఆఫ్‌లైన్ ద్వారా చేసేందుకు అధికారుల ప్రతిపాదన
- పక్క ఊళ్లో సర్వే చేసి, సిగ్నల్ లేని గ్రామాల్లో చేయకపోవడంతో నిరుపేదల ఎదురుచూపులు

ఆళ్లపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నపట్టికీ కొన్ని మారుముల గ్రామాల్లో మాత్రం సిగ్నల్ లేకపోవడంతో సర్వే కోసం నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. ఇళ్ల సర్వేలకు ముందుగానే అధికారులు సిగ్నల్ లేని గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాలకు ఆఫ్‌లైన్ ద్వారా సర్వే చేసేందుకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో ఎయిర్‌టెల్ తో పాటు బీఎస్ఎన్ఎల్, జియో, ఇతర నెట్‌వర్కుల ఉన్న గ్రామాల్లో ఇళ్ల సర్వే ఆన్‌లైన్‌కి ఇబ్బందిలేదని గుర్తించినపట్టికీ. ప్రభుత్వ సర్వే వారికి ఇచ్చిన సిమ్ (ఎయిర్‌టెల్ నెట్‌వర్క్) ద్వారా మాత్రమే ఇంటి సర్వే ఆన్‌లైన్ చేసేందుకు రూపొందించడంతో, బీఎస్ఎన్ఎల్, జియో, ఇతర నెట్‌వర్కులు ఉన్న గ్రామాల్లో ఇళ్ల సర్వే ఆన్‌లైన్ చేసేందుకు వీలు కుదరడంలేదు. ఇతర నెట్‌వర్క్ ద్వారా హాట్‌స్పాట్ చేసినపట్టికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆళ్లపల్లి మండలంలోని, మర్కోడు, రాఘవాపూరం, నడిమిగూడెం పంచాయతీలే కాకుండా జిల్లా వ్యాప్తంగా సుమారుగా 30 పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సిగ్నల్ సమస్య రావడంతో అధికారులు ఆయా గ్రామాలను గుర్తించి ఆఫ్‌లైన్ ద్వారా సర్వే చేసేందుకు ప్రతిపాదనలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఇళ్ల సర్వేకు సిగ్నల్ సమస్య ఉందని గ్రామాల్లో నిరక్షరాసులకు, కొందరికి తెలియకపోవడంతో పక్క గ్రామాల్లో సర్వే చేస్తున్నారు.. మా గ్రామానికి.. మా ఇంటికి ఎప్పుడు వస్తారోనని నిరుపేదలు ఎదురు చూస్తున్నారు.

రామయ్యను దర్శించుకున్న బీహార్ రాష్ట్ర అడిషనల్ సీఎస్

భద్రాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని బీహార్ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఎస్.విజయలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం, లక్ష్మీతాయారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు.

రేపు ఖమ్మంలో

సుదీర్ఘ భజన భక్తి గీతాల కార్యక్రమం

- ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సుదీర్ఘ భజనభక్తిగీతాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు కార్యక్రమ నిర్వాహకుడు నాగసాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీనియస్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కళాకారులు, సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



బిరుదును ప్రదానం చేస్తున్న దృశ్యం

ఘనంగా కంచి పరమాచార్యుల
ఆరాధనోత్సవం

ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు భద్రాద్రి విద్వత్‌శేఖర బిరుదు ప్రదానం

భద్రాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు భద్రాద్రి విద్వత్ శేఖర బిరుదును కామకోటి శిష్యకోటి శుక్రవారం ప్రదానం చేశారు. భద్రాచలంలో శుక్రవారం కంచికామకోటి పీఠాధీశ్వరులు చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వాముల ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కంచికామకోటి పీఠం అధిపతులు విజయేంద్ర సరస్వతిస్వామి అనుగ్రహంతో చంద్రమౌళీశ్వర ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహాస్వామి వారి పాదుకలను సంతానప్రద ఆంజనేయస్వామి వారి ఆలయంనుంచి ఊరేగింపుగా స్థానిక శుభం ఫంక్షన్‌హాలుకు తీసుకొచ్చారు. అనంతరం చంద్రమౌళీశ్వర ఆరాధన, త్రిశతి అర్చన, పాదుకార్చన, మహామంగళ హారతి వైదిక కార్యక్రమాలను కామకోటి శిష్యకోటి వారు నిర్వహించారు. అనంతరం ప్రముఖ సంస్కృత పండితులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులకు భద్రాద్రి విద్వత్ శేఖర బిరుదును టీఎఫ్‌డీసీ ఛైర్మన్ పొదెం వీరయ్య, దేవస్థానం ఈవో రమాదేవిలు ప్రదానం చేయడంతో పాటు ఉపమానమును అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణాధికారి వి.రామకృష్ణంరాజు, భద్రాద్రి దేవస్థానం ప్రధాన అర్చకుడు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ, మల్లారి రవికుమార్ శర్మ, వేనూతుల ఆంజనేయ వరప్రసాద్ శర్మ, నరసింహాచార్యులు, శివరామకృష్ణ శర్మ, స్మార్త పాఠశాల అధ్యాపకులు ఇంద్రగంటి పవన్‌కుమార్, సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు ఆకెళ్ల శ్రీరామ్, శ్రీపాద శ్రీకర్, కౌశిక్, పాల్గొన్నారు.

కేజీబీవీల్లో 30నుంచి ఆన్‌లైన్ తరగతులు

- మహిళా కానిస్టేబుల్‌తో రాత్రి పూట భద్రత
- డీఈవో సోమశేఖర శర్మ

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగులు గత 17రోజులుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి జిల్లాలోని కేజీబీవీలలో రాత్రి పూట మహిళా కానిస్టేబుల్‌తో భద్రతను ఏర్పాటు చేశామని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. సోమవారం హైదరాబాద్ డైరెక్టరేట్ నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు ప్రారంభిస్తున్నట్లు డీఈవో తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం జిల్లాలోని 14 కేజీబీవీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యార్థులు నష్టపోకుండా ఆన్‌లైన్ తరగతులు ఏర్పాటు చేసిందని, విద్యార్థులు కేజీబీవీలలో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్‌తో డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులందరికి డిజిటల్ క్లాసులు నడుస్తాయని వివరించారు. కేజీబీవీలలో మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో పాల్గొంటే వారిస్థానంలో పాఠశాలలోని మధ్యాహ్న భోజన కార్మికులతో విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రగతి దారుల్లో...

(5వ పేజీ తరువాయి)

సమస్య తప్పింది. అలాగే భద్రాచలంలో అసంపూర్తిగా ఉన్న కరకట్ట దిగువ భాగాన్ని కూడా రూ.38కోట్లతో పనులు పూర్తి చేయించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి పర్యటనకు వచ్చి భద్రాచలం ఆలయ అభివృద్ధి కోసం భూసేకరణ కోసం రూ.63కోట్లు మంజూరు చేశారు.

కాలేజీలకు మహర్దశ...

ఖమ్మంలో మెడికల్ కాలేజీకి రఘునాథపాలెంలో సుమారు 40 ఎకరాల భూమి కేటాయించడంతోపాటు రూ.160కోట్లతో భవనాల పనులు కూడా రఘునాథపాలెం మండలంలో ప్రారంభమయ్యాయి. త్వరలో దీనికి శంకుస్థాపన జరగనుంది. అలాగే మద్దులపల్లిలోని జేఎన్‌టీయూ కళాశాల శాశ్వత భవన నిర్మాణాలకు 35ఎకరాల భూమి కేటాయించడంతోపాటు రూ.108.60కోట్లు ప్రభుత్వం మంజూరుచేసింది. ఇవి పనులు ప్రారంభించాల్సి ఉంది. ఖమ్మంలో స్వామినారాయణ గురుకుల పాఠశాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించబోతున్న ఇంటర్నేషనల్ స్కూల్స్ ఖమ్మం, మధిర, పాలేరు తదితర నియోజకవర్గాల్లో మంజూరయ్యాయి. వీటికి శంకుస్థాపనలు జరిగాయి. అలాగే దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సత్తుపల్లి మెగా ఫుడ్‌పార్కు పనులు పూర్తిచేయించి ఇటీవల మంత్రి తుమ్మల ప్రారంభించారు. అలాగే జిల్లాలో కోదాడ-ఖమ్మం జాతీయ రహదారి పనులు పూర్తికాగా.. ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-కొరివి రహదారి పనులు కూడా వేగవంతం అయ్యాయి. ఖమ్మానికి రింగ్‌రోడ్డుకూడా మంజూరయింది.

అలాగే కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదనలు వెళ్లాయి. కొవ్వూరు, భద్రాచలం, మల్కన్‌గిరి రైల్వేలైన్లు కూడా ఈ ఏడాది మంజూరయ్యాయి. అలాగే సింగరేణి సోలార్ విద్యుత్‌ప్లాంట్ కొత్తగూడెంలో ఈ ఏడాదే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫిబ్రవరిలో ప్రారంభించారు.

ఖమ్మం సారథీనగర్‌లో రైల్వే అండర్‌బ్రిడ్జి నిరుపయోగంగా ఉండగా సుమారు రూ.70కోట్లతో పనులు పూర్తిచేయంచి ఇటీవల మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రూ.130కోట్లతో మోడల్ మార్కెట్‌గా రూపకల్పన చేశారు. మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కూడా ఈ ఏడాదే పనులు ప్రారంభమై ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలో మధిర నియోజకవర్గానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించడంతో పాటు మధిర, ఎర్రుపాలెం మండలాలు ఇండస్ట్రియల్‌పార్కులు ఈ ఏడాది మంజూరు చేయించారు. అలాగే ఎర్రుపాలెం-అమరావతి రైల్వేలైన్ ఈ ఏడాది మంజూరైంది.

సమస్యలు అనేకం

ఉమ్మడి జిల్లాలో 2024లో అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరుతోపాటు అనేక పనులకు ప్రతిపాదనలు వెళ్లినా.. ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఉమ్మడి జిల్లాకు యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఖమ్మం కేంద్రంగా ప్రతిపాదన ఉంది. దీనిపైనా 2024లో కదలికలేదు. అలాగే కొత్తగూడెంలో మైనింగ్, సైన్సు యూనివర్శిటీ ఏర్పాటు డిమాండ్ ఉంది. అశ్వారావుపేటలో హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. భద్రాచలం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయింపుతోపాటు గోదావరి నదిలో రివర్ టూరిజం, బోటింగ్ గోదావరి బీచ్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

ఐదు పంచాయతీల సమస్య

భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న ఐదు పంచాయతీలు ఏపీలో మన్యం జిల్లాలో ఉన్నాయి. యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం, పిచుకులపాడు పంచాయతీలు తెలంగాణలో కలపాలనే డిమాండ్ ఉంది. ఇరురాష్ట్రాల సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిల సమావేశంలో చర్చకు వచ్చినా కార్యరూపం దాల్చలేదు. దీనిపై 2025లో పరిష్కారం అవుతుందన్న ఆశ జిల్లా ప్రజల్లో ఉంది. అలాగే కొత్తగూడెం-బోనకల్ రహదారిని 4లైన్లుగా అభివృద్ధి, కొత్తగూడెం-ఇల్లెందునుంచి హైదరాబాదుకు జాతీయరహదారిగా అభివృద్ధి, సారపాక-ఏటూరునాగారం, భద్రాచలం-భూపాలపట్నం జాతీయరహదారులుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే భద్రాచలం-పాండురంగాపురం రైల్వేలైన్ ఏర్పాటుతోపాటు జిల్లాలో విస్తరిస్తున్న ఆయిల్‌పామ్ పరిశ్రమకు అనుబంధంగా కొణిజర్ల మండలంలో గోద్రేజ్ పామాయిల్ పరిశ్రమ, వేంసూరు మండలంలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో పామాయిల్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. బయ్యారం ఉక్కు పరిశ్రమ రాష్ట్ర విభజన చట్టంలో రూపకల్పన జరిపినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. గోదావరి జలమార్గం, గోదావరి జలకాలుష్య నివారణ ప్రాజెక్టు, జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటుపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పకడ్బందీగా ‘ఇందిరమ్మ’ ఇళ్ల సర్వే



(5వ పేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు. సర్వే ప్రాంతాల్లో ముందస్తుగా ప్రజలకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు కూడా తాము ఇందిరమ్మ నివాసాలు నిర్మాణం చేసుకొనే ఇంటి స్థలం డాక్యుమెంట్స్ ఇవ్వాలని సూచించారు. ప్రతి రోజు నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఎన్యుమరేటర్లు ఇళ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. యాప్‌లో ప్రతి కాలం సరిగ్గా పూరించాలని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగడానికి వీలులేదన్నారు. సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల ఇళ్ల వద్ద యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. రెండో దఫా వెరిఫికేషన్‌ను ఎంపీడీవోలు జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. సకాలంలో సర్వే పూర్తి చేసేందుకు అవసరమైన సిబ్బందిని, లాగిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు సూచించారు. డీఆర్డీవో సన్యాసయ్య, గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాసరావు, ఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి నెహ్రూకప్
అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

భద్రాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం నుంచి జనవరి 5 వరకు అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నెహ్రూకప్ గౌరవ సలహాదారు ఎస్కే అజీమ్, ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు, కన్వీనరు ఎస్కే సలీం తెలిపారు. శుక్రవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 27 నుంచి టోర్నమెంటు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తేదీని పొడిగించడం జరిగిందన్నారు. ఈ ఏడాది 21 టీములు పాల్గొంటున్నాయని తెలుగు రాష్ట్రాలతో పాటు చత్తీస్‌గడ్ రాష్ట్రం నుంచి కూడా టీంలు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. టోర్నీ విజేతలకు రూ.50 వేలు, రన్నరప్‌కు రూ.30 వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్‌లను అందజేయనున్నట్లు తెలిపారు. నెహ్రూకప్‌ను మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. హెచ్‌సీఏ జట్టుకు ఎంపికైన విద్వాన్, భారత మహిళ అండర్-19 క్రికెటర్ గొంగడి త్రిష నెహ్రూకప్ టోర్నీమెంటు నుంచే స్ఫూర్తి పొంది రాణించారని పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో బాలయోగి, ట్యూరి శ్రీధర్, గుమ్మలూరు శ్రీనివాసరావు, సదానందం, మడిపల్లి నాగార్జున, సురేష్‌బాబు పాల్గొన్నారు.

నమ్మించి నట్టేట ముంచాడు..

(5వ పేజీ తరువాయి)



వ్యాపారాన్ని చూసిన పలువురు వ్యక్తులు.. సంపాదన బాగానే ఉందని నమ్మి పెద్ద మొత్తంలో అప్పులు ఇచ్చారు. ఈ క్రమంలో అద్దెకుండే ఇంటి యజమాని కూడా పెద్ద మొత్తంలో డబ్బు అప్పుగా ఇచ్చాడు. ఖమ్మం, నేలకొండపల్లి, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన వారి నుంచి అప్పులు తీసుకున్నాడు. బోదులబండలో ఓ వ్యక్తి వద్ద ప్రైవేటు చిట్టీలు వేసి పాడుకున్నాడు. మొత్తంగా దాదాపుగా రూ.6కోట్ల వరకు వసూలు చేసినట్టు తెలుస్తోంది.

19నుంచి కనపడటం లేదు...

ఈనెల 15న ఓ పార్టీ చేసిన రఫీ తన వాళ్లకు బాగా లేదని చెప్పి ఈనెల 19న నేలకొండపల్లి నుంచి వెళ్ళిపోయాడు. హైదరాబాద్ పోతున్నట్టు చెప్పాడు. బస్సు ఎక్కించి వద్దామని నేలకొండపల్లికి చెందిన ఓ వ్యక్తి తోడుగా వెళ్లాడు. ఆయనున్నంత సేపు హైదరాబాద్‌కు ఎన్ని బస్సులు వచ్చినా ఎక్కలేదని, మీరు వెళ్ళండి, నేను వెళతానని చెప్పి అతన్ని పంపించి వేశాడని తెలుస్తున్నది. రఫీ వెళ్లి 9 రోజులైనప్పటికీ తిరిగి రాలేదు. ఇక్కడి వాళ్ల ఫోన్లు చేసినప్పటికీ ఫోన్లు ఎత్తకపోవటంతో అనుమానం వచ్చింది. దీంతో తాము మోసపోయినట్టు భావించి బాధితులు లబోదిబోమంటున్నారు. ఇదిలావుండగా, రఫీకి అప్పులిచ్చిన వాళ్ల తనను ఇబ్బంది పెడుతున్నారని, అతన్ని పట్టుకొని న్యాయం చేయాలని లక్ష్మణ్ అనే వ్యక్తి శుక్రవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. లక్ష్మణ్‌ను ముందుపెట్టి సామాన్లు, బిల్డింగ్ మెటీరియల్ షాపును రఫీ నిర్వహించినట్టు తెలిసింది. దీంతో నిన్ను చూసే రఫీకి అప్పులిచ్చామని లక్ష్మణ్‌పై ఒత్తిడి చేస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

ఎస్ఎస్‌వీ తరహాలోనే మోసం...

నేలకొండపల్లిలో ఎస్ఎస్‌వీ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేసిన మంగాపురంతండాకు చెందిన ఓ వ్యక్తి కోట్లు వసూలు చేసి మోసం చేసిన విషయం విదితమే. తాజాగా రఫీ కూడా అదే తరహా మోసానికి పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. అధిక వడ్డీలకు ఆశపడి వ్యక్తి పూర్వాపరాలు తెలియకుండా లక్షల్లో డబ్బులివ్వడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని బాలుడి మృతి

- కొత్తగూడెం టూటౌన్‌లో కేసు నమోదు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను ఢీకొని ఓ బాలుడు మృతి చెందిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లారీ డ్రైవర్‌గా పని చేసే ఇల్లందు ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖాదర్ తన భార్య, ఇద్దరు పిల్లలతో రామవరం ఎస్సీ బి నగర్‌లోని బంధువులు గౌస్ గృహప్రవేశానికి వచ్చారు. ఈ క్రమంలో ఖాదర్ కుమారుడు జమీర్ పాషా(15) ఇంటి సామగ్రిని తీసుకొని వచ్చేందుకు, మరో బాలుడిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని రామవరం వైపు వెళ్లాడు. సీఆర్‌పీ క్యాంపు ప్రాంతంలో ఆ ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆ డివైడర్ మధ్యలో ఉన్న సెంట్రల్ లైటింగ్ పోల్‌ను వాహనం నడుపుతున్న జమీర్ పాషాకు బలంగా తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయి మృతి చెందాడు. మృతిచెందిన బాలుడు ఖమ్మం ప్రాంతంలో పదవ తరగతి విద్యనభ్యసిస్తున్నాడు. తండ్రి అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుభకార్యం జరుగుతున్న ఆ గృహంలో బాలుడి మృతితో విషాద చాయలు అలుముకున్నాయి. బంధువులు, కుటుంబ సభ్యుల రోధన చూపరులను చలింప చేసింది.

‘మోదుగు’కు గానకోకిల పురస్కారం



వైరా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని పాలడుగు గ్రామానికి చెందిన జానపద కళాకారుడు, కవి, రచయిత మోదుగు గోవిందరావుకు గానకోకిల పురస్కారం లభించింది. శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలో రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావుకు ఈ గానకోకిల అవార్డును ప్రదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సంస్థ నిర్వాహకులు మేకల చంద్రశేఖర్‌యాదవ్, సుందర్‌మర్యాడీ, రమేష్, వెంకన్న, సీతరాములు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

నేడు సత్తుపల్లిలో 6వ వార్షిక భక్త సమ్మేళనం

సత్తుపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్, శ్రీ రామకృష్ణ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం 6వ వార్షిక భక్త సమ్మేళనం రెండు రోజుల పాటు మాధురీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల, పొంగులేటితో పాటు తెలంగాణ రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానందజీ మహరాజ్, భావప్రచార పరిషత్ ఉపాధ్యక్షుడు స్వామి పుజనానంద మహరాజ్, విజయవాడ రామకృష్ణ మిషన్ బాధ్యుడు స్వామి శితికంఠానంద మహరాజ్ హాజరవ్వనున్నట్లు నిర్వహకులు చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, రాజరత్నాచారి, చల్లగుళ్ల అప్పారావు తెలిపారు.

విద్యా వికాసానికి పీఎంశ్రీ

- కేంద్ర నిధులతో పాఠశాలలకు సౌకర్యాలు..
- రెండు విడతలుగా నిధుల మంజూరు
- భద్రాద్రి జిల్లాలో 24 పాఠశాలలకు రూ.79.49లక్షలు..
- ఖమ్మం జిల్లాలో 28పాఠశాలలకు రూ.85.48,లక్షలు



కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం పాఠశాలల్లో వసతులను కల్పించేందుకు ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద నిధులు మంజూరు చేస్తుంది. దీనిలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండు విడతలుగా ఈ నిధులు మంజూరు చేశారు. మొదటి దశలో 50శాతం, రెండో దశలో 50శాతం నిధులు మంజూరు చేశారు. జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికచేసిన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 52 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనుగుణంగా నిధులను మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులతో ఏయే పనులకు ఖర్చు చేయాలో విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది.

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో...

జిల్లాలో మొదటి దశలో 20, రెండో దశలో నాలుగు పాఠశాలలు ఎంపిక చేశారు. ఈనిధులు నేరుగా పాఠశాలల ఖాతల్లో జమ అయ్యాయి. జిల్లాలో 24 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గ్రీన్ గ్రాంట్ కింద రూ.46,83,000, రెండు పాఠశాలలకు ప్రీ ప్రైమరీ గ్రాంట్ కింద రూ.6,66,500, 24పాఠశాలలకు వరల్డ్ డిసేబుల్ డే గ్రాంట్ రూ.1,00,000, స్కూల్ యానివల్ గ్రాంట్ రూ. 25,00,000 నిధులు పాఠశాల ఖాతల్లో జమ అయ్యాయి.

ఖమ్మం జిల్లాలో..

జిల్లాలో 28 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనుగుణంగా నిధులు మంజూరయ్యాయి. జిల్లాలో మొదటి దశలో 22, రెండవదశలో ఆరు పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ నిధులు నేరుగా పాఠశాలల ఖాతల్లో జమ అయ్యాయి. తొలివిడతగా 50శాతం, రెండవ దశలో 50శాతం నిధులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. స్కూల్ యానివల్ గ్రాంట్ రూ. 25,00,000, గ్రీన్ స్కూల్ గ్రాంట్ రూ. 52,52,000, ప్రీ ప్రైమరీ గ్రాంట్ కింద రూ. 6,56,500, వరల్డ్ డిసేబుల్ డే గ్రాంట్ రూ. 1,40,000 నిధులు జమ అయ్యాయి.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం..

పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధులను ఏయే పనులకు ఖర్చు చేయాలో విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ప్రధానంగా పాఠశాల ఆవరణంలో కిచెన్, గార్డెన్‌లను ఏర్పాటుచేసి మధ్యాహ్నం భోజనానికి అవసరమైన కూరగాయాలను పండించాలి. పాఠశాలల తరగతి గదుల్లో ఎల్‌ఈడీ దీపాలను అమర్చాలి. పాఠ్యాంశాలకు అనుగుణంగా వివిధ రకాల క్లబ్‌ల ఏర్పాటు చేసి, మానసిక వైద్యులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో సదస్సులు నిర్వహించాలి. పాఠశాలల్లో ఉత్పన్నమయ్యే చెత్త, చెదరాలతో సేంద్రియ ఎరువులు తయారుచేసి మొక్కలకు వినియోగించాలి. గ్రీన్ స్కూల్ పేరుతో మొక్కలు నాటి సంరక్షించడం వంటి కార్యక్రమాలకు నిధులను ఖర్చుచేయాలి.

విద్యార్థుల సంఖ్య ప్రకారం కేటాయింపులు ఇలా..

1నుంచి 100మంది	రూ.50వేలు
101నుంచి 250మంది	రూ.75వేలు
251నుంచి 1000మంది	రూ.లక్ష
1000కంటే ఎక్కువమంది	రూ.1.50లక్షలు



మడిలో విత్తనాలు వెదజల్లుతున్న రైతులు

‘వెద’ సాగు.. లాభాలు బాగు

- కల్లూరు రైతుల ఆసక్తి

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెద జల్లే పద్ధతిపై వరిసాగులో కల్లూరు మండల ప్రాంతానికి చెందిన రైతులు జిల్లాలోనే అగ్రగామిగా నిలిచారు. 60 శాతం రైతులు ఈ విధానానికి మొగ్గు చూపారు. మండలంలో 33,200 ఎకరాల్లో వరిసాగు అవుతుంది. గత ఏడు సంత్సరాలుగా కల్లూరు ప్రాంతానికి చెందిన రైతులు వెద జల్లే సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ యాసంగి సీజనల్ మండలంలోని చంద్రుపట్ల, ఎర్రబోయినపల్లి, లింగాల, పాయపూరు, ముచ్చవరం, పుల్లయ్యబంజరు, లోకవరం, చిన్నకొరుకొండి, వైన్ పురం, పెద్దకోరుకొండి చెన్నూరు తదితర గ్రామాల రైతులు ముందుగానే విత్తనం మండె కట్టి మడులలో దుక్కిలు, దమ్ము చేసి వరి విత్తనం వెదజల్లే పనుల్లో రైతులు నిమగ్నమైనారు. గత వానాకాలం సీజన్‌లో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే ఆశించిన దిగుబడి రావటంతో రైతులు సంతృప్తి చెందుతున్నారు.

నాటు వేసే విధానంలో వరి సాగు చేస్తే ఎకరాకు రూ.25 నుంచి రూ. 30 వేలు కాగా వెద జల్లే సాగులో వరి సాగు చేస్తే పెట్టుబడిలో రూ. 5 నుంచి 6 వేలు ఆదా అవుతుంది. కూలీల అవసరం లేదు. దిగుబడి కూడా 35 నుంచి 40 బస్తాల ధాన్యం వస్తుంది. పంట కాల సమయం, సాగునీరు ఆదా అవుతుంది. విత్తన ఖర్చు కూడా తగ్గుతుంది. సాధారణంగా నాటు వేసే విధానంలో ఎకరాకు 25 కేజీల విత్తనం అవసరం కాగా వెదజల్లే వరిలో 10 నుంచి 12 కేజీలకు మాత్రమే విత్తనం అవసరం ఉంటుంది.

రైతుకు లాభదాయకం...

ఎం రూప, వ్యవసాయ అధికారి



2016- 2017 నుంచి కల్లూరు మండలంలో వెదజల్లే వరి సాగుపై దృష్టి సారించేలా తొలి ప్రయత్నం చేశాం. దీంతో సాగర్ ఆయకట్టు కింది రైతులు వెదజల్లే వరి సాగుపై ఆసక్తి పెంచుకొన్నారు. ఇప్పటికే మండలంలో 16 వేల ఎకరాల్లో వెదజల్లే సాగుపై దృష్టి సారించారు. దిగుబడి కూడా ఆశాజనకంగా వస్తుంది. వెదజల్లే వరి సాగులో 48 గంటల వ్యవధిలో, లేదా 21 రోజుల్లో తొలిప్రయత్నంగా రైతులు కలుపు నివారించుకోవాలి. నాటు కూలి తగ్గుతుంది.

సింగరేణికి ‘విజిలెన్స్’ వెన్నెముక

- సంస్థ సీఎండీ బలరాం

కొత్తగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విజిలెన్స్ డిపార్టుమెంట్ సంస్థకు వెన్నెముక అని, సంస్థ ఆస్తులను పరిరక్షించడంలో, అవినీతి అక్రమాలు అరికట్టడంలో, సంస్థ నిధులు దుర్వినియోగం కాకుండా చూడటంలో ముఖ్యపాత్ర వహిస్తుందని సింగరేణి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తెలిపారు. సింగరేణి ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సింగరేణి సంస్థ విజిలెన్స్ అధికారులతో విజిలెన్స్ డిపార్టుమెంట్ కార్యకలాపాలపై ఆయన సమీక్షను నిర్వహించి మాట్లాడారు. అవినీతిని అరికట్టడంలో ఎటువంటి సవాళ్లు ఎదురైన ధైర్యంగా ముందుకు వెళ్లాలని, దీని కొరకు యాజమాన్యం పూర్తి సహకారం ఉంటుందన్నారు. మాయమాటలు చెప్పి మెడికల్ బోర్డులో అన్‌ఫిట్‌చేయిస్తామని డబ్బులువసూలు చేసేవారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని తెలిపారు. విజిలెన్స్ డిపార్టుమెంట్ చేపట్టవల్సిన పలు కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈఅండ్‌ఎం) విజిలెన్స్ కె. ప్రసాదరావు, విజిలెన్స్ అధికారులు డి. వీరయ్య, జి. రాంచందర్, వీవీఎస్. శాస్త్రి, కె. రామకృష్ణ, బి. సమ్మయ్య పాల్గొన్నారు.

అతిపెద్ద విప్లవ పార్టీగా న్యూడెమోక్రసీ..

- ఎన్డీ నేత ఆవునూరి మధు

కొణిజర్ల, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద విప్లవ పార్టీగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అవతరించబోతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఆవునూరి మధు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే విలీనసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాకీయ సైద్ధాంతికతో కొనసాగుతున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల కలయిక విప్లవ శ్రేణులకు, బడుగు బలహీనవర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ వైరా సబ్‌డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ ఖాసీం, కిషన్, దుసురు, భాష, పఠాన్‌ఖాసీంఖాన్, సీతయ్య, శాంతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన

కొణిజర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ముఖం చాటేశాడని ఆరోపిస్తూ ఓ యువతి మండలంలోని ఓ గ్రామంలో యువకుడి ఇంటిముందు నిరసనకు దిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు, మరో జిల్లాకు చెందిన యువతి హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య ప్రేమ ఏర్పడింది. విషయం యువకుడి కుటుంబసభ్యులకు తెలియడంతో వారి ఒత్తిడి మేరకు అతడు ఆమెకు దూరంగా ఉంటున్నాడు. దీంతో సదరు యువతి.. తనను మోసం చేశాడని ఆరోపిస్తూ హైదరాబాద్ ప్రాంతంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో తనకు న్యాయం కావాలని కోరుతూ మూడు రోజుల క్రితం యువకుడి స్వగ్రామం వచ్చి ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. ఈ విషయం పై ఎస్‌ఐ సూరజ్‌ను వివరణ కోరగా, ఇరువైపుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో ప్రైవేటు వ్యాపారుల దందా

- కొనుగోళ్ల ఆలస్యంతో రంగ ప్రవేశం..
- తిరగబడిన రైతులు..
- చర్యలు తీసుకుంటామన్న అధికారులు

అశ్వారావుపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నారాయణపురం ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి నేరుగా ప్రైవేటు వ్యాపారులు జొరపడి అక్కడే తక్కువ ధరకు ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించడంతో పలువురు రైతులు అధికారులపై తిరగబడ్డారు. మిల్లర్లకు ట్యాంగింగ్ ఆలస్యమవ్వడం, తేమ శాతం ఇతరత్రా కారణాలతో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల్లో అలస్యం అవుతోంది. దీంతో కొందరు రైతులు విసిగిపోయి అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యంకు కాపలాకాయలేని రైతులు ఏదో రేటుకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు మిల్లులకు వెళ్లిన ధాన్యంలో కోతలు విధిస్తుండటం కూడా రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

రైతుల్లో అసహనాన్ని గుర్తించిన ప్రైవేటు వ్యాపారులు రంగంలోకి దిగి నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పోసి ఉన్న ధాన్యం కొనుగోళ్లకు పూనుకున్నారు. అక్కడే ఏదో ధరకు ధాన్యంను కొనుగోలు చేసుకుంటున్నారు. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొద్దిగా ఆరబెట్టి తిరిగి కొనుగోలు కేంద్రాల్లోనే సదరు రైతుల పేరునే సదరు అమ్ముకునే అవకాశాలున్నాయి.

రైతుల బలహీనతను సొమ్ము చేసుకునేందుకు సంబంధిత అధికారుల సహకారం పరోక్షంగా లభిస్తుందనే విమర్శలు ఉన్నాయి. దీనిని గుర్తించిన కొందరు గ్రామస్థులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రైవేటు వ్యాపారుల గుప్పెట్లోకి వెళ్లిపోయాయని, నేరుగా కేంద్రాలలోనే ప్రైవేటు వ్యాపారులు ఎలా లావాదేవీలు జరుపుతారంటూ నిలదీశారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీని వల్ల రైతులకు ధరలో అన్యాయం జరగటమే కాక, బోనస్‌ను పొందలేక పోతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులను పంపించారు. పరిశీలించిన అధికారులు ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని, బోనస్‌ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల వద్దకు దళారులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. దళారీల నుంచి కాపాడాలని పలువురు రైతులు అధికారులకు విన్నవించారు.



కొనుగోలు కేంద్రంలో అధికారులను నిలదీస్తున్న రైతులు

క్రైం సమాచారం

లైంగిక వేధింపులపై కేసు నమోదు

తిరుమలాయపాలెం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మహిళపై ఓ వ్యక్తి లైంగికవేధింపులకు పాల్పడుతుండటంతో శుక్రవారం పోలీసు స్టేషన్‌లో నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గోల్‌తండా పంచాయతీ శివారు జింకలగూడేనికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన మహ్మద్ సైదా గత కొన్నిరోజులనుంచి లైంగిక వైధింపులకు గురిచేస్తున్నాడు. ప్రతిరోజు వెకిలి చేష్టలు చేస్తూ వేధిస్తున్నాడు. వాట్సాప్‌లో మెసేజ్‌లు పెట్టి నీ పరువు తీస్తానని బెదిరిస్తున్నాడు. ఈనేపథ్యంలో వేధింపులను భరించలేక సదరు మహిళ శుక్రవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

వైకుంఠధామం ఇన్‌చార్జిపై దాడి

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలకసంస్థలోని క్షేత్రస్థాయి సిబ్బంది కొట్లాటలు రచ్చగా మారుతున్నాయి. గతంలో ముస్తాఫానగర్‌లో కత్తులతో దాడి సంఘటన కాగా ఇప్పుడు వైకుంఠధామం ఇన్‌చార్జిపై డ్రైవర్ దాడి చేయటం కేఎంసీ అధికారుల పర్యవేక్షణను ప్రశ్నిస్తోంది. ఖమ్మంనగరంలోని 34, 35 డివిజన్లకు సంబంధించి అందుబాటులో ఉన్న వైకుంఠధామానికి పుల్లయ్య ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అన్వర్ వైకుంఠ రథం వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాగా నిర్వహణలో భాగంగా వచ్చిన డబ్బులను ప్రతీ నెల కేఎంసీకి జమ చేయాల్సి ఉంటుంది. కానీ డ్రైవర్ అన్వర్ రూ.34వేల వరకు సొంతానికి వాడుకొని పర్యవేక్షకుడు పుల్లయ్యకు అందజేయలేదు. దీంతో ఇరువురి మధ్య శుక్రవారం వివాదం తలెత్తింది. దీంతో డ్రైవర్ అన్వర్ పుల్లయ్యను కర్రతో కొట్టగా కాలుకు దెబ్బలు తగిలాయి. విషయం తెలుసుకున్న పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య విచారణ చేపట్టారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ములకలపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేశారు. ఈ ఘటన ములకలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ములకలపల్లి మండలంలోని వేముకుంట గ్రామంలో ఊరుబయట చింతచెట్టు కింద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న వేముకుంట గ్రామానికి చెందిన ఐదుగురువ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.3వేల నగదు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీని ముమ్మరం చేయాలి

- సీపీ సునీల్‌దత్

ఎర్రుపాలెం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): అక్రమరవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆయన గురువారం సందర్శించారు. ఎర్రుపాలెం మండలం తెలంగాణ ఏపీ సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్‌ఐను ఆదేశించారు. స్టేషన్ నిర్వాహణ పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులను పరిసరాలను పరిశీలించారు. పిటీషన్ల విచారణలకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీసుస్టేషన్ పరిధిలో నమోదైన కేసులు 100డయల్ కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షీట్‌లు, పెండింగ్ కేసులను పరిశీలించారు. సరిహద్దుల నుంచి స్టేషన్‌హౌజ్ మేనేజ్‌మెంట్, పోలీసుస్టేషన్ నిర్వాహణ, సెక్టార్ ఆఫీసర్ల బాధ్యతలు రెగ్యూలర్‌రోల్ కాల్ విధిగా అమలుచేయలాని సిబ్బందికి సూచించారు. పాత నేరస్థుల నివాసాలను కదలికలను గమనించాలని, అవసరమైన చోట కౌన్సెలింగ్ ఏర్పాటుచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహన చోదకులకు ప్రమాద హెచ్చరికలు చేస్తుండాలని, యువకలకు అవగాహన కలిపించాలన్నారు. ఈసందర్భంగా కమిషనర్‌కు పోలీసులు గౌరవవందనం సమర్పించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేష్, పోలీసుస్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

బాబోయ్ దొంగలు..

- తాళం పగలగొట్టి చోరీలు

ఖమ్మం క్రైం, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో గత కొద్దిరోజులుగా దొంగలు చోరీలకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఇటీవల నగరంలోని పలుప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి తాళం పగలగొట్టి చోరీకు పాల్పడుతున్నారు. గురువారం అర్ధరాత్రి నగరంలోని శ్రీనివాసనగర్‌లోని ఓప్రాంతంలో వరసగా ఉన్న మూడు ఇండ్లలో చోరీకు పాల్పడ్డారు. తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడి చోరీ చేసిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఇలా చోరీలు జరుగుతున్నా పోలీసులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నా కానీ, చర్యలు తీసుకోవడం లేదని సోషల్ మీడియాలో పలువరు అంటున్నారు. గురువారం రాత్రి జరిగిన చోరీలలో ల్యాప్‌టాప్, నగదు, ఓ ద్విచక్రవాహనం చోరీ జరిగిందని ఫిర్యాదు అందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం రూరల్, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, పోలిశెట్టిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన ఉండేటి రమేష్(45) కూలీ పనులు చేసుకుంటు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కూలి పనులతో పాటు ఒక ఎకరం భూమిని కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక గురువారం సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందాడు.

గుండెపోటుతో జీపీ కార్మికుడి మృతి

తల్లాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ కార్మికుడు కొత్తపల్లి సుందరయ్య(57) గుండెపోటుతో శుక్రవారం మృతిచెందాడు. సుందరయ్య అన్నారుగూడెం గ్రామపంచాయతీలో కార్మికుడిగా స్థానికులకు సుపరిచితుడు. ఆయన మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

స్వాతంత్ర్య సమరయోధురాలి కన్నుమూత

తల్లాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తల్లాడలో అనారోగ్యంతో స్వాతంత్ర్య సమర యోధురాలు కుంచం స్వరాజ్యలక్ష్మి(90) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. స్వరాజ్యలక్ష్మి మృతి పట్ల ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు నంబూరి మోహన్‌రావు తదితరులు సంతాపం తెలిపారు.



స్వరాజ్యలక్ష్మి(ఫైల్)

దాడి ఘటనలో వ్యక్తి పై కేసు

ఖమ్మం క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిపై దాడి చేసిన ఘటనలో ఓవ్యక్తి పై కేసునమెదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. నగరంలోని డాబాల బజార్‌లో నివాసం ఉంటున్న బుడిగం శ్రీనివాసరావు బంగారం షాపు నిర్వహిస్తారు. ఆషాపునకు వ్యాపారం నిమిత్తం నగరానికి చెందిన నాగిశెట్టి సురేందర్ అనే వ్యక్తి వస్తుండేవాడు. ఈనెల 25న బంగారు వస్తువు విషయమై ఇద్దరికి గొడవ జరిగింది. శ్రీనివాసరావుపై సురేందర్ దాడిచేసి గాయపరిచాడు. గురువారం రాత్రి సురేందర్ మద్యం సేవించి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లాడు. అక్కడ ఉన్న శ్రీనివాసరావు బామ్మర్ది సతీష్‌పై కూడా దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రహదారిపై కూలిన వంతెన

చింతకాని, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చింతకాని నుంచి కొణిజర్ల వెళ్లే ప్రధాన రహదారిలో నేరడ సమీపంలో వాగుపై ఉన్న వంతెన శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో వంతెనపై వాహనాలు ఏమి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వాహనాలు రహదారిపై తిరుగుతుండటంతో వంతెన కూలినట్లు గ్రామస్థులు తెలిపారు. కూలిన వంతెనను ఎస్‌ఐ నాగుల్‌మీరా పరిశీలించారు. వాహనాలు తిరగకుండా రహదారిను మూసివేశారు.



వంతెనను పరిశీలిస్తున్న ఎస్‌ఐ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యం: సీపీఎం

భద్రాచలం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారి భద్రాచలం పర్యటనకు వచ్చిన మచ్చ వెంకటేశ్వర్లు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా అభివృద్ధి శూన్యంగా ఉందని, జిల్లా పర్యటనల్లో కాంగ్రెస్ నాయకుల హడావుడి తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతులు నష్టపోతే ఆ నీళ్లను వేరే జిల్లాకు తరలించి చప్పట్లు కొట్టుకోవడం జిల్లా ప్రజలను మోసం చేయడమేనని స్పష్టం చేశారు. రామాలయ అభివృద్ధితో పాటు నిర్వాసితులవుతున్న స్థానికులకు నష్టపరిహారాన్ని అందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపించాలన్నారు. కరకట్ట ఎత్తు, పొడవు పెంచడంతో పాటు రిటర్నింగ్ వాల్ నిర్మించి ముంపు నుంచి భద్రాచలంను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ మావేశంలో నాయకులు ఎంబి నర్సారెడ్డి, స్వామి, బండారు శరత్‌బాబు, సున్నం గంగ, ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్ కుమార్, డి.సీతాలక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి KHAMMAM CITY
శనివారం 28 డిసెంబరు 2024
● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి
ఖమ్మం సిటీ
ZONE
8



విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయండి

ఖమ్మంఖానాపురంహవేలి,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): నల్లగొండలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆరో విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. శుక్రవారం నగరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు మాట్లాడారు. ఈనెల 28న ప్రారంభమై 30తో ముగియనున్నాయన్నారు. రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఆన్ డ్యూటీ సౌకర్యం కల్పించిందని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	40
బీరకాయ	44
పచ్చిమిర్చి	38
కాకరకాయ	34
బెండకాయ	28
పొట్లకాయ	38
దోసకాయ	34-38
చిక్కుడు	48
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	50-60
సొరకాయ	20
క్యారెట్	38
క్యాప్సికం	64
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	25

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

మన్మోహన్‌కు ఘన నివాళి

మాజీ ప్రధాని సేవలను కొనియాడిన నాయకులు

కామేపల్లి,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల పరిధిలోని కొత్తలింగాల క్రాస్‌రోడ్‌లో దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి విగ్రహం వద్ద మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమీషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, డీసీసీ లధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, గింజల నర్సింహరెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, మేకల మల్లిబాబు యాదవ్, డీఎస్, పుచ్చకాయల వీరభద్రం, గుజ్జర్లపూడి రాంబాబు, సరిరాం, జర్పుల లక్ష్మణ్, ఆర్ఎంపీ రాంబాబు తదితరులు ఉన్నారు.

టీజేఎస్ ఆధ్వర్యంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్: మన్మోహన్‌సింగ్ మృతిపట్ల తెలంగాణజనసమితి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంతాపం ప్రకటించారు. రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా, ఆర్థికమంత్రి, పదేళ్ల ప్రధానిగా దేశానికి మన్మోహన్‌సింగ్ అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో టీజేఎస్ పార్టీనాయకులు సయ్యద్ అజీమ్, గోపగాని శంకర్‌రావు, భట్టు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌కు ఘన నివాళి

తిరుమలాయపాలెం: తిమ్మక్కపేటలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి మాజీసర్పంచ్ సంద్ర వెంకన్న పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని, ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చుంచురాములు, భిక్షం, వెంకటేశ్వర్లు, రాము, పాల్గొన్నారు.

వక్కలగడ్డ నివాళి

ఖమ్మం సంక్షేమ విభాగం: మాజీ ప్రధాన మంత్రి మన్‌మోహన్‌సింగ్ మృతిపై టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో నివాళులు అర్పించారు. దేశ ఆర్థిక పురోగతిని మార్చిన ఆర్థిక ప్రధానమంత్రిగా కీర్తించారు.

దార్శనికుడు మన్మోహన్:వెన్నపూసల

నేలకొండపల్లి: దార్శనికుడు భారత మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్‌సింగ్ అని నేలకొండపల్లి ఏఎంసీ ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలేసి ఘన నివాళులర్పించారు. మన్మోహన్ ప్రధాని అయ్యాకనే దేశ ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారన్నారు. మన్మోహన్ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, శాఖమూరి రమేష్, గోళ్ళ శ్రీనివాసరావు, తేజావత్ శివాజీ, మైసా శంకర్, యండ్రాతి హ్రుషికేష్, కనమర్లపూడి రమేష్, యడవల్లి నాగరాజు పాల్గొన్నారు.



మన్మోహన్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



నేలకొండపల్లిలో మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిలిచిన మోకీలు మార్పిడి శస్త్రచికిత్స

- జిల్లా జనరల్ ఆసుపత్రిలో నిలిచిన సేవలు
- గతంలో కొందరి వైద్యుల ఆసక్తితో ఆపరేషన్లు
- ప్రస్తుత సిబ్బందిలో అనైక్యతతో ఆసుపత్రిలో వర్గపోరు



ఖమ్మంకలెక్టరేట్,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రిలో మోకీలు ఆపరేషన్లు ఏడాది నుంచి నిలిచి పోయాయి. వైద్యులు అందుబాటులో ఉన్నా పరికరాలు సక్రమంగా లేకపోవడం, నిధుల సమస్యలతో ఈ సేవలు అందడంలేదు. వైద్యవిధాన పరిషత్‌గా ఉన్నప్పుడు ఇక్కడ ఒకరిద్దరికి మోకీలు మార్పిడి సేవలను అందించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది రోగులు ఇక్కడ ఆపరేషన్లకు ఆశపడ్డారు. కానీ ఆస్పత్రి బోధనాసుపత్రిగా మారిన తర్వాత ఈసేవలుపూర్తిగా నిలిపివేశారు. మోకీలు మార్పిడిలో వినియోగించే పరికరాలు(ఇన్‌ప్లాంట్స్) ఆరోగ్యశ్రీ నుంచి తెప్పించి మరీ సేవలందించారు. ప్రస్తుతం మాత్రం ఆ దిశగా ఆస్పత్రి అధికారులు స్పందించటం లేదు.

నిపుణులు ఉన్నా.. కొరవడిన ఆసక్తి

ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ఎముకలు, కీళ్ల విభాగంలో పదిమంది వరకు వైద్యులు ఉన్నారు. అందులో ఒకరు హెచ్‌వోడీ కాగా, ఇద్దరు అసోసియేట్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నాలుగురు సీనియర్ రెసిడెంట్లు పని చేస్తున్నారు. వారితోపాటు వైద్య సిబ్బంది. ఆపరేషన్ థియేటర్లు ఉంది. మంచి అనుభవం కలిగిన ఆపరేషన్ థియేటర్, వైద్యులు అందుబాటులో ఉన్నా పరికరాలు లేకపోవడం, అసలు ఈ తరహా ఆపరేషన్లపై ఆసక్తి లేకపోవడంతో సర్జరీలు నిలిచిపోయాయి. గతంలో కొందరు వైద్యులు ఆసక్తితో అనేక సర్జరీలు, శస్త్రచికిత్సలు నిర్వహించే వారు. అప్పటి కలెక్టర్ గౌతమ్ కూడా ప్రత్యేక చొరవతో టీఎస్ఎంఎస్ఐడీసీ నుంచి మోకీలుకు, ఇతర సర్జరీలకు కావాల్సిన కావాల్సిన పరికరాలను తెప్పించి పేదరోగులకు మేలుకలిగేలా చేసేవారు. కానీ ప్రస్తుతం ఆస్పత్రిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. ఇక్కడి సిబ్బందిలో అనైక్యత కొరవడింది. ఆస్పత్రిలో మూడు వర్గాలుగా అంతర్గతంగా పోరు నడుస్తుంది.

ఒక్కో ఆపరేషన్‌కు రూ. లక్షకు పైమాటే

బయట ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక్క మోకీలు ఆపరేషన్‌కు రూ.లక్షనుంచి 2లక్షల వరకు ఖర్చు అవుతుంది.జిల్లాజనరల్ ఆస్పత్రిలో ఈ మోకీలు ఆపరేషన్‌కు అవకాశం ఉంది. ఇక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేస్తే కేవలం రూ.70 నుంచి 90 వేల లోపు పూర్తవుతుంది. ఇదిరోగులకు పూర్తిగా ఉచితంగా చేయవచ్చు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈచికిత్స చేయాలంటే వరంగల్ ఎంజీఎం, హైదరాబాద్‌లో నిమ్స్ గాంధీలాంటి ఆస్పత్రుల్లో చేయాల్సి ఉంటుంది. ఇది పేద రోగులకు తీరని ఇబ్బందిగా మారుతోంది. వ్యయప్రయాసలకోర్చి దూరం వెళ్లలేక నొప్పులతోనే బాధపడుతున్నారు. ఇక్కడికి వచ్చే రోగులకు అన్ని పరీక్షలు నిర్వహించి ఆపరేషన్‌కు మాత్రం ప్రైవేటుకు పంపిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులకు ప్రైవేటు ఆస్పత్రులతో పాటు వారితో సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఇలాంటి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలి

- రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

కామేపల్లి, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం కామేపల్లి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో పరిశీలించారు. ధాన్యం బస్తాలు రోజులు గడుస్తున్నా తరలించడంలో జాప్యం చేస్తున్నారని అన్నారు. నెలరోజులుగా కల్లాల వద్ద ధాన్యం ములుగుతుందని అన్నారు. రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సివిల్ సప్లై జిల్లా అధికారి గంటా శ్రీలతతో ఫోన్ ద్వారా వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు దుగ్గి క్రిష్ణ, వింజంనాగభూషణం, బాదావత్ శ్రీను, క్రిష్ణమూర్తి, ఉపేందర్, రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ ఫెయిర్'లో రెజోనెన్స్ విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఖమ్మం నగరంలోని రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థులు డి.శ్రీవల్లి,జి.గాయత్రి పాల్గొన్నారు. స్పోర్ట్ యునివర్సిటీ ఆఫ్ హర్యానలో బుధవారం నిర్వహించిన 51వ జాతీయ సైన్స్ ఫేయిర్‌లో 'బేబి మానిటరింగ్ సిస్టం' ప్రాజెక్టను ప్రదర్శించినారు. ముఖ్యఅతిథిగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యారు. తెలంగాణ నుంచి ఎంపిక అయిన ఖమ్మం రెజొనెన్స్ స్కూల్ శ్రీనగర్ విద్యార్థుల 'బేబి మానిటరింగ్ సిస్టం" ప్రాజెక్టను సందర్శించారు. విద్యార్థులు డి.శ్రీవల్లి, జి.గాయత్రి గైడ్ టీచర్స్ బి.హరికృష్ణ,యం.జ్యోత్స్నలను అభినందించారు. జాతీయస్థాయిలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నారులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు .



విద్యార్థులను అభినందిస్తున్న గవర్నర్

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

నేలకొండపల్లి,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి):నేలకొండపల్లి, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వహణా కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.సర్వీస్ సొసైటీ, లయన్ కంటి ఆసుపత్రి, వైరా వారి సహకారంతో నేలకొండపల్లి గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున మండల ప్రజలు ఈసదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య శిబిరం నిర్వహణా కమిటీ ప్రకటనలో కోరింది.

గాంధీ విగ్రహానికి మాజీ సర్పంచ్‌ల వినతి

పెనుబల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు వీఎంబంజర్ రింగ్ సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు పెనుబల్లి మండల మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులు చెల్లించి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన మాజీ సర్పంచ్‌ల కుటుంబాలను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మందడపు అశోక్‌కుమార్, గోదా చెన్నారావు, తేజావత్ తావునాయక్, భూక్యా పంతులీ, తడికమళ్ల సీత, ఆళ్ల అప్పారావు, కోడె రాంబాబు, మైసయ్య పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి కన్నుమూత

ఖమ్మంరూరల్,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆరెకోడు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు ఉప్పగండ్ల సత్యం(90) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. పార్టీ జాతీయ నాయకుడు బాగం హేమంతరావు, రాష్ట్ర నాయకుడు మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నివాళులర్పించారు.

పేద ఆర్యవైశ్యుల కోసం పనిచేయాలి

వైరా,డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆసంఘం రాష్ట్ర నాయకుడు, స్థానిక వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ మహాసభ పనిచేయాలని పిలుపునిచ్చారు. వాసవీ కల్యాణమండప అధ్యక్షుడు పెరుమాళ్ల కృష్ణమూర్తి, సంఘం నాయకులు నూకల వాసు, ప్రసాద్, గజ్జల కృష్ణమూర్తి, కేవీ.సుబ్బారావు, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, సముద్రాల మురళీకృష్ణ, కటకం శివకృష్ణ, దారా వెంకటకృష్ణ, కొణతాలపల్లి నగేష్, మిట్టపల్లి విజయ్ పాల్గొన్నారు.

మడుపల్లి హైస్కూల్‌కు ఫర్నీచర్ వితరణ

మధిరరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లోని డైనింగ్ హాల్‌కు ఫర్నీచర్‌ను బహూకరణగా అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత శీలం నర్సిరెడ్డి, అరుణ జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రత్యూష దంపతులు ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు అందజేశారు.

లక్ష్యం తప్పిన డీఆర్ఎఫ్

- అధికారుల సేవలు, కార్యాలయం ఉద్యోగులుగా సిబ్బంది సేవలు
- సెలవుల కాలంలో సంతకాలు పెట్టుకుంటూ వేతనాలు

ఖమ్మంసంక్షేమవిభాగం,డిసెంబరు27: మున్నేరు వరదల ముంపుతో ఖమ్మం నగరాన్ని అతలాకుతం చేసింది. ఆ సమయంలో డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్), ఎన్డీఆర్ఎఫ్ ఎక్కడా అంటూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నుంచి మంత్రుల వరకు ఎంతో ఆరాట పడ్డారు. అయితే మున్నేరు వరదల అనుభవంతో బలోపేతం కావాల్సిన ఖమ్మం నగర పాలక సంస్థలోని డీఆర్ఎస్ విభాగం బలహీన పడటం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఈ బృందానికి తప్పని సరిగా ఓ ప్రభుత్వ ఉద్యోగి పర్యవేక్షణలోనే కొనసాగాలి. కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలి.

ఉన్నతాధికారుల సేవల్లో


ఖమ్మంనగర పాలక సంస్థలోని డీఆర్ఎఫ్‌కు 20 మంది ఉద్యోగులతో రెండు బృందాలుగా డీఆర్ఎఫ్ నిర్మాణం చేశారు. పాలేరులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ఉద్యోగులు మరణించటంతో వారి స్థానంలో మహిళ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వటంతో ఒకరు పార్కులో మరొకరు కేఎంసీలోని సీ1 సెక్షన్‌లో పనిచేస్తున్నారు. మరో పురుష ఉద్యోగి కమిషనర్ వద్ద పీఆర్వోగా పనిచేస్తున్నారు. మరో పురుష ఉద్యోగి అసిస్టెంట్ కారు డ్రైవర్(అద్దె కారుకు)కు డ్రైవర్‌గా వినియోగించటంతో 20 మంది ఉద్యోగుల్లో ఇప్పుడు డీఆర్ఎఫ్ విధులు నిర్వహించే వారి సంఖ్య కేవలం 16కు చేరింది. ప్రతీ ఐదుగురు సిబ్బందికి ఒక పర్యవేక్షకుడు ఉండాల్సి ఉండగా, మొత్తం 16 మంది ఉద్యోగులకే ఒకే ఉద్యోగిని సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు.

సెలవ్ పెట్టి.. దర్జాగా సంతకాలు చేసి..

కంచె చేను మేసిన చందంగా ఉంది డీఆర్ఎఫ్ పర్యవేక్షకుని తీరు. 16మంది డీఆర్ఎఫ్ సిబ్బంది రెండు బృందాలుగా ఉన్న కూడా ఒకే ఉద్యోగి పర్యవేక్షణ చేస్తున్నారు. కిందిస్థాయిలోని ఉద్యోగులకు ఆదర్శంగా ఉండాల్సిన పర్యవేక్షకుడే తప్పులు చేసి దొరికపోవటంతో సిబ్బంది కూడా ఇదే అదునుగా మాట వినటం లేదని తెలుస్తోంది. డీఆర్ఎఫ్ పర్యవేక్షక ఉద్యోగి డిసెంబరు 11, 12, 13 తేదీల్లో వరసగా మూడు రోజులు సంబంధం లేని(ఇంకా ఆదేశాలు రాని) అధికారి వద్దకు వెళ్లికి సెలవ్ తీసుకొని వ్యక్తిగత పనులపై వెళ్లారు. తిరిగి 14న విధుల్లోకి వచ్చిన తర్వాత సెలవ్‌పై వెళ్లిన రోజులకు హాజరు రికార్డులో సంతకాలు చేసి వేతనాలు పొందేందుకు చూస్తున్నారు. సదరు పర్యవేక్షకుడు ఉదయం సంతకాలు చేసి, ఆటోతో కిరాయులు చేసుకునేందుకు వెళ్లటంతో పర్యవేక్షణ తప్పుతోంది.



మూడు రోజులు సెలవ్ దరఖాస్తు



హాజరు రికార్డులో సంతకాలు

అధికారికంగా బాధ్యతలు ఇవ్వలేదు
బెల్లం రాధిక, కేఎంసీ ఉద్యాన అధికారి

కేఎంసీలో రెండు డీఆర్ఎఫ్ బృందాలుండగా వాటిలో ఒక టీంను ఉద్యాన విభాగానికి కేటాయించారు. కానీ అధికారికంగా ఆదేశాలు ఇవ్వలేదు. డీఆర్ఎఫ్ టీం లీడర్‌కు మూడు రోజులు సెలవ్ ఇచ్చిన విషయం వాస్తవమే. అతను తిరిగి సంతకాలు చేసిన విషయం తెలియదు. అలా చేస్తే వేతనం కట్ చేసి బిల్లు చేయిస్తాం.

విలీన మహాసభను జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో ఈనెల 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూడెమోక్రసీ విప్లవ పార్టీల విలీన మహాసభలను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. నేటిసమాజంలో వస్తున్న పరిస్థితుల్లో విప్లవ పార్టీల ఐక్యత అవసరం అని భావించి ఈనెల 28న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన మహాసభ నిర్వహిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో గొర్రెపాటి వీరస్వామి, పోలెపొంగు నాగయ్య, పేరాల శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, భాస్కర్, మోహన్‌రావు, పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధురాలు వారం రోజుల క్రితం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మెడికల్ వార్డులో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని వైద్యశాల సిబ్బంది మార్చురిలో భద్రపరిచారు. ఎవరూ రానందున ఓపీ పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముష్టికుంట్ల హెల్త్ సబ్ సెంటర్‌కు సుస్తీ..

బోనకల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాల బారీన పడిన వారికి వైద్య సేవలందించే లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. కాని వాటికే సుస్తీ చేస్తే ప్రజల బాదలు వర్ణాతీతమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మేజర్ పంచాయతీగా పేరున్న ముష్టికుంట్ల గ్రామ జనాభా 4200. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించేందుకు 40 ఏళ్ల క్రితం హెల్త్ సబ్‌సెంటర్ భవనాన్ని నిర్మించారు. ఏఎన్ఎం అక్కడ నివాసం ఉండి వైద్య సేవలందించేలా భవన నిర్మాణం చేశారు. కొన్ని ఏళ్ల పాటు వైద్య సిబ్బంది అక్కడ నివాసం ఉండి వైద్య సేవలందించారు. కాల క్రమేణా ఆరోగ్య ఉపకేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు భవనం చుట్టు రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షానికి వరద నీరంతా ఆరోగ్య ఉపకేంద్రంలోకి చేరుతుంది. స్లాబ్ పై పెచ్చులు ఊడి వర్షపు నీళ్ల లోపల పడుతున్నాయి. ఫ్లోరింగ్ దెబ్బతింది. తాగునీటి సౌకర్యం లేదు. టాయ్‌లెట్స్ వినియోగంలో లేవు. వైద్య సేవలు అందించేందుకు భవన సౌకర్యం అనుకూలంగా లేక పోవడంతో వైద్య సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని, క్వార్టర్ కూడ నిర్మిస్తే వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంటుదని పలువురు భావిస్తున్నారు.



ముష్టికుంట్లలోని సబ్‌సెంటర్

భవనం శిథిలావస్థకు చేరుకుంది: బంధం నాగేశ్వరరావు

ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మించి నాలుగు దశాబ్దాల కాలం గడవడంతో వైద్య సేవలందిచేందుకు అనుకూలమైన వాతావరణం అక్కడ లేదు. వర్షం వస్తే వరద నీరంతా అక్కడ చేరి దుర్వాసన వెదజల్లుతుంది. పైకి భవనం బాగానే కనిపిస్తున్నా మేడి పండు చందనా లోపలంతా పగుళ్లమయం. నూతన భవనాన్ని నిర్మించాలి.

నక్కలగరుబులో పశువైద్యశిబిరం

మధిరరూరల్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): మధిర మండలం నక్కలగరుబులో పశువైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకుమారి, సిబ్బంది శిబిరంలో తమ సేవలందించారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అన్నివర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన టీడీపీ

- ముమ్మరంగా సభ్యత్వ నమోదు

సత్తుపల్లిరూరల్,డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అని సీనియర్ నాయకుడు పోట్రు రామారావు అన్నారు. నలభై వసంతాల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు 2024-2026సభ్యత్వాలను నమోదు చేయించుకోవాలని, రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. సభ్యత్వ రుసుము ఒక రూపాయి నుంచి ఆరంభమై నేడు రూ.100కు చేరిందని, చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రానున్న రోజుల్లో తెలంగాణాలో సైతం అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. రూ.100చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2లక్షలుగా ఉన్న ప్రమాద బీమా సదుపాయాన్ని ఇప్పుడు పార్టీ రూ.5లక్షలకు పెంచిందని, కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లూరు మోహన్,వెలిశాల లక్ష్మాచారి, తిమ్మిడి రాంబాబు, రాచర్ల చంద్రశేఖర్, వినుకొండ రమేష్ పాల్గొన్నారు.



సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు



యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

మధిర, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలు ఈనెల 28,29,30తేదీలలో నల్గొండలో జరగనున్నాయని ఈ మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఏ వినోదరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మధిరలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు సంఘం బాధ్యులతో కలిసి మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బీ నాగరాజు, ఇ వీరయ్య, షేక్ ఇబ్రహీం, బి చెన్నయ్య, లాల్ అహ్మద్, వి కొండలరావు, ఎం రాజు, బీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కలగరుబులో పశువైద్యశిబిరం

మధిర రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం నక్కలగరుబులో పశువైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందజేశారు. పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకుమారి, సిబ్బంది శిబిరంలో తమ సేవలందించారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ కిరణ్, జేఈవో మురళీ, మాజీ ఉపసర్పంచ్ సంపసాల రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి మాజీ సర్పంచ్‌ల వినతి



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెనుబల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచ్‌లు వీఎంబంజర్ రింగ్ సెంటర్లోని మహాత్మాగాంధీ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర మాజీ సర్పంచ్‌ల సంఘం పిలుపు మేరకు పెనుబల్లి మండల మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులు చెల్లించి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన మాజీ సర్పంచ్‌ల కుటుంబాలను ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మందడపు అశోక్‌కుమార్, గోదా చెన్నారావు, తేజావత్ తావునాయక్, భూక్యా పంతులీ, తడికమళ్ల సీత, ఆళ్ల అప్పారావు, కోడె రాంబాబు, మైసయ్య, రాయపూడి మల్లయ్య, దొడ్డపనేని రవి, కోమటి ప్రసాద్, షేక్.గౌస్ పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మన్మోహన్‌సింగ్

» మాజీ ప్రధాని మృతికి కాంగ్రెస్ సంతాపం
» నివాళులర్పించిన నాయకులు



సత్తుపల్లిలో మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మన్మోహన్‌సింగ్ దేశంలో ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చిన ధీశాలీ అని, ఈజీఎస్, ఆర్టీఏ, ఆధార్ చేపట్టి ముందడుగు వేశారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. మన్మోహన్ సింగ్ మృతిపట్ల శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను అందరం స్మరించుకోవాలని కొనియాడారు.కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్మోహన్‌కు మువ్వా నివాళులు

యావత్ దేశం గర్వపడే స్థాయికి తీసుకొచ్చిన నాయకుడు, సుదీర్ఘకాలం ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మనమధ్య లేకపోవడం బాధకరమని టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయ బాబు అన్నారు.

సండ్ర సంతాపం

మన్మోహన్ సింగ్ మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే సండ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సంస్కరణ వాది మన్మోహన్‌సింగ్

●ఏన్కూరు,(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు దివంగత నేత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఏన్కూరులో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, నాయకులు మేడ ధర్మారావు, చందమమా నరసింహారావు, లచ్చిరాంనాయక్, రత్నకంర వరప్రసాదరాజు, శోభన్‌నాయక్, సాయిలి నాగయ్య, నిమ్మల నాగేశ్వరరావు, సాయిరోహిత్, పంతగాని నరేష్, కట్టా సత్యనారాయణ, భూక్యా బాబులాల్, నన్నేఖాన్, ఇండ్ల కృష్ణయ్య కనిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

●వైరా (ఆంధ్రజ్యోతి): వైరాలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, బొళ్ల గంగారావు, పణితి శ్రీనివాసరావు, బీడీకే. రత్నం, కోసూరి శ్రీను, పాలేటి నర్సింహారావు, పొట్లపల్లి శ్రీనివాసరావు, దొడ్డా పుల్లయ్య, కన్నెగంటి హుస్సేన్, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్, వీరబాబు, పొదిల హరినాథ్, కర్నాటి హన్మంతరావు, పెద్దప్రోలు లక్ష్మయ్య, మిట్టపల్లి శ్రీను నివాళులర్పించారు.

●కొణిజర్ల, (ఆంధ్రజ్యోతి): కొణిజర్లలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరు రమేష్, కొనతం ఉమాశంకర్, కాశిమల్ల భాస్కర్, సతీష్, సుధాకర్, పానుగంటి శ్రీను, రొంటె వెంకన్న, దండు మోహన్‌రావు, సామినేని నరసింహరావు పాల్గొన్నారు.

●చింతకాని (ఆంధ్రజ్యోతి): చింతకానిలో బందెల నాగార్జున, ఓర్సు వీరభద్రం, కూరపాటి రాము పాల్గొన్నారు.

●మధిరటౌన్(ఆంధ్రజ్యోతి): మధిరలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ మాజీ జడ్పీటీసి సూరంశెట్టి నాగభూషణం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు మల్లాది వాసు, కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, గద్దల మాధురి మాజీ సర్పంచ్‌లు చిట్టిబాబు, హరిబాబు, కర్నాటి రామారావు నాయకులు నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, పాటిబండ్ల సత్యంబాబు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, బండారు నరసింహారావు, అద్దంకి రవి, మిరియాల కాశీ, జహంగీర్, గొల్లమందల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

●కల్లూరు (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఏఎంసీ చైర్మన్ బాగం నీజదేవి, కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకర చౌదరి, ఏనుగు సత్యంబాబు, చిమిరాల సురేష్, ఎస్ బాజీ, పెద్దబోయన శ్రీనువాసరావు, ముకర విజయరావు, ఎస్‌కే తురాబలి, తదితరులు పాల్గొన్నారు.

● పెనుబల్లి, వేంసూరులోను కాంగ్రెస్ నాయకులు మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఏన్కూరులో నివాళులర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మధిరలో కాంగ్రెస్ నాయకులు



కొణిజర్లలో నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ రామారావు

ప్రభుత్వ ఆసుపత్రికి స్వచ్ఛంద సంస్థ చేయూత

పెనుబల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమారి టన్స్ ఫర్‌ది నేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెనుబల్లి ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు ఉపయోగపడే సామగ్రిని శుక్రవారం అందజేశారు. డీఎస్‌ఐసీ లయన్స్‌క్లబ్, డాల్స్, టెక్సాస్ అండ్ ఆర్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో రూ.లక్షన్నర విలువ చేసే ఓటీ డూమ్ లైట్, పాగ్ మిషన్, వీల్‌చైర్స్, ధర్మామీటర్, బీపీ ఆపరేటర్, చైర్స్ అందజేశారు. కార్యక్రమంలో సమారి సంస్థ అధినేత శ్యామ్‌కుమార్, సభ్యులు ఆర్వీప్రసాద్, దామోదర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, డాక్టర్ వరుణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్ల పంపిణీ దృశ్యం

వైరా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లో జీఎస్ఎస్ డేకేర్ సెంటర్లలో చదువుతున్న సుమారు 160మంది విద్యార్థులకు గ్రేస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు, గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు. పేద విద్యార్థులకు గ్రేస్ సొసైటీ అండగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి తాడేపల్లి మానస, మాజీ ఉపసర్పంచ్ గుండెపోటు జాన్, సెంటర్ల ఇన్‌చార్జ్‌లు మోదుగు వినోద్‌కుమార్, గంజి రోజమ్మ, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణారెడ్డి, సుందర్‌రావు, ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, మహబూబీ, మణి, బేబి పాల్గొన్నారు.

సాగుచేసిన ప్రతీ ఎకరాకు రైతుభరోసా ఇవ్వాలి



గొల్లెనపాడులో ఆందోళన చేస్తున్న రైతులు

వైరా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతుభరోసా ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన రైతు మహాసభ అనంతరం ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అందించిన రైతుబంధు సాగులో లేని భూములకు రైతుబంధు ఇచ్చి ఉంటే వాటిని నిలిపివేసి సాగుచేస్తున్న ప్రతి ఎకరాకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాకాకుండా వివిధరకాల కొర్రీలు వేసి రైతుభరోసాకు కోత విధించటం సరికాదని ఆక్షేపించారు. రైతు సంఘం నాయకులు బాణాల శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాసరావు, నల్లమోతు వెంకటనారాయణ, అమరనేని వెంకటేశ్వరరావు, వెంపటి రాజా, ఆళ్ల శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, రాజబాబు, కంచల శ్రీనివాసరావు, కొణిదన ధర్మారావు, చంద్ర ప్రసాద్, వెంపటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు వినుకొండకు సన్మానం



వినుకొండ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) మండల పరిధి లోని టీ. వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వినుకొండ శ్రీనివాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. స్థానికంగా గల ఆర్‌సీఎం చర్చిల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్దకోరుకొండి విచారణ గురువు జోజి క్రైస్తవ భక్తుల తరుపున శాలువలతో సత్కరించారు. కార్యక్రమలో కందిమళ్ల సామేలు, పి ప్రకాశం, వి జయరాజు, సుందరరావు, రాహేలు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి, శ్రద్ధలతో అయ్యప్ప మాలధారుల నగర సంకీర్తన

బోనకల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప దీక్షాపరులు అత్యంత భక్తి, శ్రద్ధలతో నగర సంకీర్తనా కార్యక్రమాన్ని నిర్వహించారు. జ్యోతిని వెలిగించి గ్రామంలోని పుర వీదుల్లో ఊరేగింపుగా వెళ్లారు.

స్వామివారి విగ్రహాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం

సభ్యత్వ నమోదులో జిల్లా నాయకుడు రామారావు



సభ్యత్వం నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు సముచిత స్థానం ఇచ్చిన రాజకీయ విశ్వవిద్యాలయం తెలుగుదేశం పార్టీ అని సీనియర్ నాయకులు పోట్రు రామారావు అన్నారు. నలభై వసంతాల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కాంస్య విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు 2024-2026 సభ్యత్వాలను నమోదు చేయించుకోవాలని, అలాగే రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. సభ్యత్వ రుసుము ఒక రూపాయి నుంచి ఆరంభమై నేడు రూ.100కు చేరిందని, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రానున్న రోజుల్లో తెలంగాణలో సైతం అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. రూ.100చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2లక్షలుగా ఉన్న ప్రమాద బీమా సదుపాయాన్ని ఇప్పుడు పార్టీ రూ.5లక్షలకు పెంచిందని, కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మల్లూరు మోహన్, వెలిశాల లక్ష్మాచారి, తిమ్మిడి రాంబాబు, రాచర్ల చంద్రశేఖర్, వినుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మడుపల్లి హైస్కూల్‌కు ఫర్నీచర్ వితరణ



మాట్లాడుతున్న దాత చంద్రశేఖర్‌రెడ్డి

మధిర రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లోని డ్రైనింగ్ హాల్‌కు ఫర్నీచర్‌ను బహూకరణగా అందజేశారు. గ్రామానికి చెందిన దివంగత శీలం నర్సిరెడ్డి, అరుణల జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యూష దంపతులు ఈ పర్నీచర్‌ను వితరణగా అందజేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దాతలు ఈ పర్నీచర్‌ను అందజేశారు. దాత చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్వగ్రామంలోని పాఠశాలపై మమకారంతో ఈ ఫర్నీచర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత చంద్రశేఖర్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తోట నర్సింహారావు, మాజీ సర్పంచ్ శీలం వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ సాంబశివరావు, ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, మాధవరావు, కిషోర్, చారి పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యుల కోసం పనిచేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వర్తకసంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

వైరా, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో శుక్రవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆసంఘం రాష్ట్ర నాయకుడు, స్థానిక వర్తకసంఘం అధ్యక్షుడు వనమా విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు. పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ మహాసభ పనిచేయాలని పిలుపునిచ్చారు. వాసవీ కల్యాణ మండప అధ్యక్షుడు పెరుమాళ్ల కృష్ణమూర్తి, సంఘం నాయకులు నూకల వాసు, ప్రసాద్, గజ్జల కృష్ణమూర్తి, కేవీ.సుబ్బారావు, మిట్టపల్లి కిరణ్, కొల్లా రాంబాబు, సముద్రాల మురళీకృష్ణ, కటకం శివకృష్ణ, దారా వెంకటకృష్ణ, కొణతాలపల్లి నగేష్, మిట్టపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని విరమించుకోవాలి



తల్లాడలో నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

తల్లాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. నూతన వ్యవసాయ మార్కెటింగ్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, ఐనాల రామలింగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, పులి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ముష్టికుంట్ల హెల్త్ సబ్ సెంటర్‌కు సుస్తీ..

» సమస్యలతో సహవాసం » శిథిలావస్థకు భవనం



ముష్టికుంట్లలోని సబ్‌సెంటర్

బోనకల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాల బారీన పడిన వారికి వైద్య సేవలందించే లక్ష్యంతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. కాని వాటికే సుస్తీ చేస్తే ప్రజల బాధలు వర్ణాతీతమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మేజర్ పంచాయతీగా పేరున్న ముష్టికుంట్ల గ్రామ జనాబా 4200. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించేందుకు 40 ఏళ్ల క్రితం హెల్త్ సబ్‌సెంటర్ భవనాన్ని నిర్మించారు. ఏఎన్‌ఎం అక్కడ నివాసం ఉండి వైద్య సేవలందించేలా భవన నిర్మాణం చేశారు. కొన్ని ఏళ్ల పాటు వైద్య సిబ్బంది అక్కడ నివాసం ఉండి వైద్య సేవలందించారు. కాల క్రమేణా ఆరోగ్య ఉపకేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీనికి తోడు భవనం చుట్టు రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షానికి వరద నీరంతా ఆరోగ్య ఉపకేంద్రంలోకి చేరుతుంది. స్లాబ్ పై పెచ్చులు ఊడి వర్షపు నీళ్లు లోపల పడుతున్నాయి. ఫ్లోరింగ్ దెబ్బతింది. తాగునీటి సౌకర్యం లేదు. టాయ్‌లెట్స్ వినియోగంలో లేవు. వైద్య సేవలు అందించేందుకు భవన సౌకర్యం అనుకూలంగా లేక పోవడంతో వైద్య సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నూతనంగా భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని, క్వార్టర్ కూడ నిర్మిస్తే వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంటుదని పలువురు బావిస్తున్నారు.

భవనం శిథిలావస్థకు చేరుకుంది



బంధం నాగేశ్వరరావు, ముష్టికుంట్ల

ఆరోగ్య ఉపకేంద్ర భవనం నిర్మించి నాలుగు దశాబ్దాల కాలం గడవడంతో వైద్య సేవలందించేందుకు అనుకూలమైన వాతావరణం అక్కడ లేదు. వర్షం వస్తే వరద నీరంతా అక్కడ చేరి దుర్వాసన వెదజల్లుతుంది. పైకి భవనం బాగానే కనిపిస్తున్నా మేడి పండు చందనా లోపలంతా పగుళ్లమయం. నూతన భవనాన్ని నిర్మించాలి.

పంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె

చింతకాని/ ఎర్రుపాలెం/ కారేపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న టోకెన్ సమ్మెలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఉద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అమర్లపూ డి అప్పారావు, జయ, ఫణి, కమల, శ్రీను, కొండలు, సుభద్ర, తేజ, పాల్గొన్నారు.

ఎర్రుపాలెం (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయం వద్ద మండల గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులు శుక్రవారం టోకెన్ సమ్మె నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల సపాయి సిబ్బంది పాల్గొన్నారు



చింతకానిలో..



కారేపల్లిలో ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు

కారేపల్లి (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల పరిషత్‌కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర కమిటి పిలుపుమేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నరేందర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.